# శ్రీ రమణ జ్యోతి

మే 2017

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

May 2017

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | నేనెవరిని? | ముదిగొండ వీరభద్రయ్య | 3 |
| 2. | రామయోగి | పామరాజు వెంకట లావణ్య రావు | 10 |
| 3. | శ్రీమతి సూరినాగమ్మ గారు | కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి | 14 |
| 4. | గురువు అనుగ్రహమే దివ్యమైన ఔషధము | మల్లాది ఫణిమాల | 18 |
| 5. | శ్రీ భగవాన్ పాద సన్నిధిలో | జి. శ్రీహరిరావు | 20 |
| 6. | ఆత్మసాక్షాత్కార సూత్రాలు | పింగళి సూర్యసుందరం | 22 |
| 7. | **Gandhiji and Bhagavan** | Shankarlal Banker | 26 |
| 8. | **The Mysterious Knot** | V. Krithivasan | 32 |
| 9. | **Nambi - The Saint Who Made Lord Ganesha Eat!** | | 36 |
| 10. | **Ahetuki Bhakthi** | Kanchi Mahaswami | 40 |
| 11. | **Bhagavan's Advice to Get a Bridegroom** | | 42 |


శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరమణకేంద్రం)


**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# నే నెవరిని?

(శ్రీ రమణుల తమిళ రచన 'నాన్ యార్' యొక్క ఆంధ్రీకరణం: శ్రీప్రణవా నందులు. ఆధునిక తెలుగులోనికి మార్పు: ముదిగొండ వీరభద్రయ్య)

*(గత సంచిక తరువాయి)* - ముదిగొండ వీరభద్రయ్య

"నేనెవరిని?" అన్న విచారణ చేతనే మనస్సు అణగుతుంది. నేను అనే తలపు ఇతర తలపులన్నింటినీ చంపి (నాశనము చేసి) శవాన్ని కాల్చిన కట్టెలాగా తానుకూడా నశిస్తుంది. ఇతర తలపులు లేచినప్పటికీ వాటిని పూర్తిగా నెరవేర్చడానికి ప్రయత్నించకుండా "అవి ఎవరికి కలిగినవి?" అని విచారించాలి. ఎన్ని తలపులు పుడ్తే ఏమి? జాగ్రత్తగా ఒక్కొక్క తలపును (అది) పుట్టిన వెంటనే "ఇది ఎవరికి కలిగింది?" అని విచారించినట్లయితే నాకు అని తోస్తుంది. నేనెవరినని ప్రశ్నించితే మనస్సు తన పుట్టినచోటికి మళ్లుతుంది. పుట్టిన తలపూ అణగి పోతుంది. ఈ విధంగా అభ్యాసం కాగా కాగా, మనస్సుకి తన జన్మస్థానం లో నిలిచి ఉండే శక్తి ఎక్కువౌతుంది. సూక్ష్మమైన మనస్సు మెదడు అన్న ఇంద్రియం ద్వారా బైటకు వెళ్తున్నప్పుడు స్థూలమైన నామరూపాలు తోస్తున్నవి. హృదయంలో నిలుకడ చెంది ఉన్నప్పుడు నామరూపాలు మఱుగవుతున్నవి. మనస్సును బైటకు పోనీయకుండా హృదయంలో నిలుపుకోవడానికే "అహంముఖము" లేక "అంతర్ముఖము" అని పేరు. హృదయం నుంచి దాన్ని బైటకు పోనివ్వడం బహిర్ముఖం (అని పేరు). ఈ రకంగా మనస్సు హృదయంలో నిలిస్తే తలపులకన్నిటికీ మూల మయిన "నేను" అన్నది పోయి, ఎప్పుడూ ఉండే తాను మాత్రం ప్రకాశి స్తుంది. నేను అను తలపు కొంచెమైనా లేనిచోటే (స్థితియే) స్వరూప మవుతుంది. అదే మౌనమనబడ్తుంది. ఈ రీతిగా ఊరక ఉండటానికే జ్ఞానదృష్టి అని పేరు. ఊరక ఉండడమంటే మనస్సుని ఆత్మస్వరూపం లో లయింపచేయడమే. అట్లాకాక, ఇతరుల తలపులను తెలిసికోవడం,

మూడు కాలాలను తెలిసికోవడం, దూర దేశాలలో జరిగే విషయాలను తెలిసికోవడం మొదలైనవి జ్ఞానదృష్టి కాలేవు.

ఆత్మస్వరూపమొక్కటే సత్యమైనది. జగజ్జీవేశ్వరులు (జగము, జీవుడు, ఈశ్వరుడు) ముత్తెపు చిప్పలోని వెండిలాగా, అందులో (ఆత్మ స్వరూపంలో) కల్పితాలు. ఈ మూడు కూడా ఒకే కాలంలో తోచి ఒకే కాలంలో మఱుగవుతున్నవి. స్వరూపమే జగము, స్వరూపమే నేను. స్వరూపమే ఈశ్వరుడు, అంతయు శివస్వరూపమే అవుతుంది.

మనస్సు అణగడానికి విచారము తప్ప తగినట్టి ఉపాయాలు వేరే లేవు. వేరే ఉపాయాల చేత అణగినప్పటికీ, మనస్సు అణగినట్లు ఉండి, మళ్లీ లేస్తుంది. ప్రాణాయామం చేత మనస్సు అణగుతుంది. ఐతే ప్రాణము అణిగి ఉండేటంత దాకా మనస్సు కూడా అణగి ఉండి, ప్రాణం బైటకు రాగానే తాను కూడా బైటకు వచ్చి, వాసనలకు వశమై పోయి అలసిపోతుంది. మనస్సుకీ, ప్రాణానికీ పుట్టినచోటు ఒక్కటే. తలపే మనస్సు యొక్క స్వరూపము. నేను అన్న తలపే మనస్సు యొక్క తొలితలపు. అదే అహంకారం. అహంకారం ఎక్కడ పుడ్తున్నదో అక్కడినుంచే శ్వాస బయలుదేరుతున్నది. కాబట్టి మనస్సు అణగుతున్న ప్పుడు ప్రాణమూ, ప్రాణం అణగుతున్నప్పుడు మనస్సున్నూ అణగు తుంది. కాని సుషుప్తిలో మనస్సణగినప్పటికీ ప్రాణమణగడం లేదు. దేహ రక్షణ కోసం, దేహమన్నది మరణించిందేమో అన్న సందేహం కలుగకుండడం కోసం ఈ విధంగా ఈశ్వర నియతిచేత ఏర్పడి ఉంది. జాగ్రత్తు (మెలకువ) లోనూ, సమాధిలోనూ మనస్సు అణగునప్పుడు ప్రాణం అణగుతున్నది. ప్రాణమన్నది మనస్సు యొక్క స్థూలరూపం. మరణకాలం దాకా మనస్సు ప్రాణాన్ని శరీరంలో ధరించుకొని ఉండి, దేహం మరణించే సమయంలో దాన్ని (ప్రాణాన్ని) కమ్ముకొని (అంటే తనలో నిముడ్చుకొని) పోతున్నది. కాబట్టి ప్రాణాయామం మనస్సుని

లోబరచుకోవడానికి తోడ్పడుతుందే కాని, మనస్సుని నశింపచేయదు.

ప్రాణాయామంలాగే మూర్తిధ్యానం, మంత్రజపం, ఆహారనియమం అనేవి మనస్సుని లోబరచుకోవడానికి సహకారులే. మూర్తిధ్యానం చేతా, మంత్రజపంచేతా, మనస్సు ఏకాగ్రతను చెందుతుంది. ఎప్పుడూ చలిస్తూ ఉండే ఏనుగుతొండంపైన ఒక గొలుసుని ఉంచినప్పుడు ఆ ఏనుగు వేరేదానిని కాక, దానినే పట్టుకొని ఎట్లా పోతున్నదో, ఆ విధం గానే నిరంతరం చలిస్తూ ఉండే మనస్సును ఏదో ఒక నామానికో, రూపానికో అలవాటు చేస్తే, దాన్నే గ్రహించి (పట్టుకొని) ఉంటుంది. మనస్సు లెక్కలేని తలపులుగా పగిలిపోవడం చేత ఒక్కొక్క తలపుకూడా ఎంతో బలహీనమవుతున్నది. తలపులు నశించగా, నశించగా ఏకాగ్ర స్థితిని పొంది, దానిచేత శక్తితో కూడిన (బలపడిన) మనస్సుకి ఆత్మవిచారం సులభంగా సిద్ధిస్తుంది. నియమాలన్నిటిలో గొప్ప దయినట్టి మితమైన సాత్త్వికాహారనియమం చేత మనస్సు యొక్క సత్త్వగుణం వృద్ధి పొంది ఆత్మవిచారానికి సాయపడుతుంది.

వెనువెంట వచ్చేటటువంటి విషయవాసనలు లెక్కకుమించి, సముద్రపుటలలలాగే కలిగేవి అయినప్పటికీ, స్వరూపధ్యానం పెరుగగా పెరుగగా అవన్నీ నశిస్తాయి. వాసనలన్నీ కూడా అణగి స్వరూప మాత్రంగా ఉండడం సాధ్యమవుతుందా అనేటటువంటి సంశయరూప భావానికైనా చోటీయకుండా స్వరూపధ్యానాన్నే నిరంతరం కలిగి ఉండాలి. ఒకడు ఎంత పాపి అయినప్పటికీ ‘‘నేను పాపినికదా, ఎట్లా కడతేఱ గల్గుతాను?’’ అని వెక్కివెక్కి ఏడుస్తూ ఉండక, ‘‘నేను పాపిని’’ అన్న తలపును పారదోలి స్వరూపధ్యానంలో దృఢంగా, పట్టుదలతో ఉన్నట్లయితే అతడు తప్పక బాగుపడ్తాడు (అంటే కడతేఱుతాడు).

మనస్సులో ఎంతదాకా విషయవాసనలు ఇల్లుకట్టుకొని ఉంటాయో అంతదాకా "నేను ఎవరిని?" అన్న విచారణా అవసరమే. తలపులు తోస్తూ ఉండగా తోస్తూ ఉండగా వాటినన్నిటినీ అప్పటికప్పుడే అవి పుట్టినచోటనే విచారణ చేత నాశనం చేయాలి. అన్యమును ఆశించ (చేర) కుండడం వైరాగ్యం, లేక నిరాశ, అవుతుంది. తన్ను వదలక పోవడం (అంటే తనను గురించిన ఎఱుకను ఎల్లప్పుడూ కలిగి ఉండడము) జ్ఞానమవుతుంది. నిజానికి వైరాగ్యమూ, జ్ఞానమూ రెండూ ఒక్కటే. (సముద్రంలోంచి) ముత్యాలను పైకి తెచ్చేవాళ్లు తమ ఒడిలో రాళ్లను కట్టుకొని మునిగి సముద్రపుటడుగున ఉండే ముత్యాలనెట్లా పైకి తెస్తారో, అట్లాగే ఒక్కొక్కడు వైరాగ్యాన్ని పొంది తనలో లోతుగా మునిగి ఆత్మముత్యాలను పొందగల్గుతాడు. తన స్వరూపం పొందేదాకా తాను నిరంతరం స్వరూపస్మరణ ఉన్న వాడయినట్లయితే, (అంటే ఎప్పుడూ ఆత్మను గురించిన ఎఱుక కలిగి ఉన్నట్లయితే), అదొక్కటే చాలు. కోటలో విరోధులున్నంత దాకా, అందులోనుంచి బైటకు వస్తూనే ఉంటారు. వాళ్లు అగుపడీ, అగుపడగానే వెంటవెంటనే చంపుతున్న ట్లయితే కోట వశమవుతుంది.

నిజానికి దైవమూ, గురుడూ వేరువేరు కాదు. పులినోట్లో పడిందెట్లా తిరిగిరాదో, అట్లాగే శ్రీగురుని కటాక్షవీక్షణంలో పడినవారు, వారిచేత రక్షింపబడ్తారే కాని ఎప్పుడూ వారిచేత వదలివేయబడరు. అయినా కూడా గురుడు చూపిన దారిననుసరించి వెళ్లాలి.

ఆత్మచింతనం తప్ప వేరే చింతలు పుట్టడానికి కొంచెమైనా చోటు ఈయక ఆత్మనిష్ఠాపరుడై ఉండడమే తనను ఈశ్వరునికి అర్పించు కోవడం. ఈశ్వరుని మీద ఎంత భారం మోపినప్పటికీ, దానినంతా ఆయన మోస్తున్నాడు. సమస్త కార్యాలను ఒక పరమేశ్వర శక్తి నడుపు తుండడం వల్ల మనం దానికి లోబడి ఉండడం మానివేసి 'ఇట్లా

చేయాలి, అట్లా చేయాలి' అని ఎప్పుడూ చింతించడం ఎందుకు? భారాలనన్నింటిని రైలుబండి మోసికొనిపోవడం తెలిసికూడా, దానిలో ప్రయాణిస్తున్న మనం, మన చిన్నమూటను అందులో వేసి సుఖంగా ఉండకుండా, దాన్ని మన నెత్తిమీదనుంచుకొని ఎందుకు కష్టపడాలి?

సుఖమన్నది ఆత్మస్వరూపమే. సుఖమూ, ఆత్మస్వరూపమూ వేరు కావు. ఆత్మసుఖమొక్కటే సత్యం. ప్రపంచ వస్తువులలో ఒక్కదాన్లోనైనా సుఖం లేదు. వాటివల్ల సుఖం కల్గుతున్నదని మనం మన అవివేకం వల్ల తలుస్తున్నాము. మనస్సు బైటకు వెళ్తున్నప్పుడు దుఃఖాన్ని అనుభవిస్తున్నది. యథార్థానికి మన కోరికలు తీరినప్పుడల్లా అది (మనసు) యథా స్థానానికి మళ్లినదై ఆత్మసుఖాన్నే అనుభవిస్తున్నది. అట్లాగే నిద్ర (సుషుప్తి), సమాధి, మూర్ఛ కాలంలోనూ, కోరిన వస్తువు దొరికినప్పుడూ, ఇష్టంకాని వారికి చెడు కలిగినప్పుడూ, మనస్సు అంతర్ముఖమై (అంటే లోనికి తిరిగినదై) ఆత్మ సుఖాన్నే అనుభవిస్తున్నది. ఇట్లా మనస్సు ఆత్మను వదలి బైటకు వెళ్లడం, లోపలికి మరలడాలతో అంతులేకుండా అలసిపోతున్నది. చెట్టుకింది నీడ సుఖంగా ఉన్నది. బైట సూర్యుని వేడి క్రూరంగా ఉన్నది. బైట ఎండవేడిమి కొట్టినవాడు, నీడకు పోయి చల్లదనం అనుభవిస్తున్నాడు. కొంతసేపు అక్కడ ఉండి, తర్వాత బైటకు వచ్చి వేడియొక్క క్రౌర్యాన్ని సహింపలేక మళ్లీ చెట్టుకిందికి వస్తున్నాడు. ఈ రీతిగా నీడలోనుంచి ఎండలోకి పోవడమూ, ఎండలోనుంచి నీడలోనికి పోవడమూ అనే రాకపోకలు చేస్తున్నాడు. ఇట్లా చేసేవాడు అవివేకి. వివేకియేమో నీడను విడిచివెళ్లడు. అట్లాగే జ్ఞాని మనస్సు బ్రహ్మమును వదలి ఉండదు. కాని అజ్ఞాని మనస్సో ప్రపంచంలోకి ప్రవేశించి దుఃఖపడడమూ, కొంచెంసేపు బ్రహ్మము వైపుకి తిరిగి సుఖమనుభవించడంగా ఉన్నది. జగము మరుగవుతున్నప్పుడు అంటే తలపులు లేనప్పుడు - మనస్సు ఆనందమనుభవిస్తున్నది, జగంతోస్తున్నప్పుడు అంటే తలపు కలిగినప్పుడు అది దుఃఖం అనుభవిస్తున్నది.

ఇచ్ఛచేత, సంకల్పం చేత, ప్రయత్నం చేత కాకుండా, సూర్యుని సన్నిధి మాత్రం చేతనే సూర్యకాంతపురాయి అగ్నిని కక్కుతుంది. కమలాలు వికసిస్తాయి. నీళ్లు ఇంకుతాయి. లోకంలోని జనులు తమతమ పనుల్లోకి చేరి వాటివల్ల అణగిపోతారు. సూదంటురాయి ముందర సూది కదులుతుంది. వీటిలాగానే సంకల్పరహితుడైన ఈశ్వరుని సన్నిధి అన్న విశేషమాత్రంచేత నడిచేటటువంటి (ప్రవర్తించే టటువంటి) మూడు వృత్తులకూ, లేక పంచకృత్యాలకూ లోబడిన జీవులు, తమతమ కర్మానుసారంగా చేష్టలు కలిగి - అంటే కార్యాలను చేసి నిశ్చేష్టితులవుతున్నారు. కాని అతనికి సంకల్పం లేదు. ఏ కర్మమూ అతణ్ని అంటుకోదు, లోకకర్మలు సూర్యుని అంటకపోవడం, అంతటా వ్యాపించిఉండే ఆకాశాన్ని చతుర్భూతాల గుణ అగుణాలు అంటకుండా ఉండడం ఎట్లాంటిదో ఇది అట్లాంటిది.

ఏ శాస్త్రంలోనైనా ముక్తి చెందడానికి మనస్సుని అణచ (జయింప) వలెనని చెప్పి ఉన్నది. మనోనిగ్రహమే శాస్త్రాలయొక్క అత్యంత ముఖ్య అభిప్రాయం. ఇది తెలిసింతర్వాత (కూడా) శాస్త్రాలను మితిలేకుండా చదవడంవల్ల ఫలితం లేదు. మనో నిగ్రహానికి "నేనెవరిని?" అని విచారించాలేగాని శాస్త్రాలలో విచారించడం ఏమిటి? తనని తాను పొందుటకు జ్ఞాననేత్రం చేతనే కదా తెలిసికోవాలి? రాముడు తాను రాముణ్ని అని తెలిసికోవడానికి అద్దం కావాలా? 'తాను'- పంచకోశాలలో ఉండేటువంటిది. శాస్త్రాలేమో పంచకోశాలకు అవతల ఉండేవి. కాబట్టి పంచకోశాలను అవతలకు తోసివేసి విచారించి తెలియవలసిన తన్ను శాస్త్రాల ద్వారా వెదకడం వ్యర్థమే. బంధంలో ఉండే తాను ఎవరినని విచారించి తన యథార్థ స్వరూపాన్ని తెలిసికొనడమే ముక్తి. నిరంతరం మనస్సుని ఆత్మలో ఉంచుకొని ఉండడానికే ఆత్మవిచారమని పేరు. ధ్యానమంటే, తన్ను సచ్చిదానంద బ్రహ్మము అని భావించడం. నేర్చిన వాటి నన్నిటినీ ఒకప్పుడు మరవవలసి వస్తుంది.

ఊడ్చిపారేయాల్సిన చెత్తను పరీక్షించడం వల్ల ఎట్లా ప్రయోజనం లేదో, అట్లాగే తన్నెఱుగవలసిన వాడు, తనను కప్పి ఉంచిన తత్త్వాల నన్నిటినీ గుంపుగా చేర్చి తోసివేయక అవి ఇన్ని అని లెక్కించడం వల్ల కాని, వాని గుణాలను పరీక్షించడంవల్ల కాని లాభంలేదు. దానివల్ల అతనికి కలిగే ఫలమేమీ లేదు. ప్రపంచాన్ని ఒక స్వప్నంలాగా తలచు కోవాలి.

జాగ్రత్తు దీర్ఘం, స్వప్నం క్షణికం - అవడంతప్ప వేరే భేదం లేదు. జాగ్రత్తులో జరిగే వ్యవహారాలన్నీ ఎంత నిజమైనవిగా తోస్తున్నవో, స్వప్నంలో జరిగే వ్యవహారాలుకూడా ఆ సమయంలో అంతే నిజంగా తోస్తున్నవి. స్వప్నంలో మనస్సు మరొక శరీరాన్ని ధరిస్తోంది. జాగ్రత్ స్వప్నాలు రెండింటిలోనూ తలపులూ, నామరూపాలూ ఏకకాలంలో కలుగుతున్నాయి.

మంచి మనస్సనీ, చెడ్డమనస్సనీ రెండు మనస్సులు లేవు. మనస్సు ఒక్కటే. వాసనలే శుభమనీ, అశుభమనీ రెండురకాలు. మనస్సు అశుభ వాసనలతో కూడి ఉన్నప్పుడు చెడ్డమనస్సనీ చెప్పబడ్తుంది. ఇతరులెంత చెడ్డవారుగా అనిపించినప్పటికీ వాళ్లని ద్వేషించకూడదు. రాగద్వేషాలు రెండుకూడా వదలివేయాల్సినవి. ప్రపంచవిషయాలలో మనస్సుని ఎక్కువగా ఉంచకూడదు. సాధ్యమైనంతవరకు ఇతరుల కార్యాలలో ప్రవేశించకూడదు. ఒకడు ఇతరులకిచ్చే వాటినన్నిటినీ తనకే ఇచ్చు కొంటున్నాడు. ఈ సత్యం తెలిసికొన్నట్లయితే ఇతరులకు ఇవ్వకుండా ఉండేవాడెవడు?

''తాను'' లేస్తే అన్నీ లేస్తాయి. 'తా'నణిగితే అన్నీ అణగుతాయి. ఎంతగా మనం అణకువ కలిగి ప్రవర్తిస్తామో, అంతగా మేలవుతుంది. మనస్సుని లోబరచుకొని ఉంటే ఎక్కడ ఉండినా ఉండవచ్చు.

*(సమాప్తం)*

# రామయోగి

(ఫిబ్రవరి 2017 సంచిక తరువాయి) - పామరాజు వెంకట లావణ్య రావు

కార్తీక దీపం జరిగే రోజులలో కొన్ని సందేహాలు తీర్చుకోదలచి భగవాన్‌ను అనుమతి కోరాడు రామయ్య. భగవాన్ రాత్రి అయితే బాగుంటుందని అన్నారు. రాత్రి రామయ్య వెళ్ళేటప్పటికి తలుపులు మూసి ఉన్నవి కనుక దోమలు కుట్టూ ఉన్నప్పటికి లెక్కచేయక వరండాలో పడుకొన్నాడు. 3 గం॥ల ప్రాంతంలో భగవాన్ ఎందుకో బయటికి వచ్చి చూస్తే రామయ్య కన్పించాడు. వెంటనే ఆయనను భగవాన్ లోపలికి తీసుకు వెళ్ళి తాను పడుకొన్న చోటే పడుకోమన్నారు. ఆ రాత్రి సమయంలో రామయ్య కొన్ని ప్రశ్నలకు సమాధానం పొందడం విశేషం. ఉదాహరణకు:

ప్ర: నిర్వికల్ప సమాధి అంటే ఏమి?

జ: సంకల్పం లేనిదే నిర్వికల్పం.

ప్ర: సమాధిలో బ్రహ్మ భావం కూడా ఉంటుందా?

జ: భావం ఉంటే నిర్వికల్పం కాజాలదు.

భగవాన్ సన్నిధిలో కూర్చున్నప్పుడు శాంతి అయత్నకృతంగా లభించేది రామయ్యకు. మూడు, నాలుగు గంటలు అలాగే సమాధి స్థితిలో ఉండేవాడు. అప్పుడప్పుడు మనస్సు ఒక రూపం ధరించి బయటకు వస్తున్నట్లు అనిపించేది. తిరిగి సాధన తీవ్రతరం చేసి మనస్సును అంతర్ముఖం చేసేవారు. మనస్సు హృదయంతో కలిసి పోయేది. మనస్సు హృదయంలో లయమైతే ఆత్మసాక్షాత్కారమే. తత్ఫలితంగా ఎనలేని శాంతి లభించేదట. క్రమంగా రామిరెడ్డి, రామయ్యగా, యోగి రామయ్యగా (రామయోగి) పరిణామం సంభవించింది.

భగవాన్ నుంచి అనేక సందేహాలకు నివృత్తి దొరికింది రామయోగికి. ఆ సందేహాలను సమాధానాలను కొన్నింటిని రమణమహర్షితో

సంభాషణలు అనే గ్రంథంలో పొందుపరిచారు. వాటిలో కొన్ని:

ప్ర: తన వద్దకు చేరిన శిష్యునికి గురువు, బ్రహ్మానికి గుణములు, మాలిన్యములు ఉండవని బోధిస్తారు కదా అప్పుడు గురువు ఒక వ్యక్తిగా మాట్లాడినట్లే కదా. గురువు అట్లా మాట్లాడకపోతే శిష్యుని అజ్ఞానం ఎట్లా నశిస్తుంది. గురువు మాట్లాడిన మాటలు సత్యానికి దారి తీస్తాయా?

జ: గురువు ఎవరితో మాట్లాడాలి? ఎవరికి బోధించాలి? ఆయనకు ఆత్మకంటె భిన్నంగా ఏమీ కన్పించదు కదా.

ప్ర: కానీ శిష్యుడు వివరణ అడుగుతున్నాడు.

జ: గురువు అతనిని వేరుగా చూడడు. అందరూ ఆత్మసాక్షాత్కారం పొందినవారే కనుక అదే శిష్యుడికి తెలియడం లేదు. శిష్యుని అజ్ఞానాన్ని మాత్రమే సూచిస్తాడు. వ్యక్తిగా ఉండడు. సాక్షాత్కారం అంటే దేవుడు నాలుగు చేతులు, శంఖం, చక్రం వంటి వాటితో కన్పించడం కాదు. అది కేవలం భౌతికమైనది, భ్రమలాంటిది. అక్కడ చూచేవాడుండాలి. చూచేవాడు మాత్రమే సత్యం, శాశ్వతం. కనుక అది పరోక్షజ్ఞానం. చూచేవాడు (ద్రష్ట) మాత్రమే ప్రత్యక్ష అనుభూతి. శరీరమే నేను అనే భావం వల్ల కళ్ళకు కనబడేదే ప్రత్యక్షం, కాని చూచేవాడు కాదు అను కుంటారు. నేను సాక్షాత్కారం పొందలేదని గాని, ఆత్మను కాను అని గాని, ఆత్మనుండి వేరు అని గాని అనలేరు.

ప్ర: భగవాన్ లాంటి మహాజ్ఞానులు ఎల్లప్పుడూ సత్యంలోనే ఉంటారు కనుక ఇతరులు కూడా అలా తేలికగానే ఉండగలమనుకుం టారు. కాని అదే సామాన్యులకు కష్టం కదా.

జ: ఎవరైనా ఆత్మను కాదంటారా?

ప్ర: భగవాన్ చేసినట్లు విషయాలను సూటిగా ఉంచే ధైర్యం ఎవరికీ ఉండదు కదా.

జ: ఉన్నది ఉన్నట్లు చెప్పడానికి ధైర్యంతో పనేముంది?

రామయోగి వంశీయులు దానధర్మాలకు పేరుమోసిన వారు. ఆయనకు కూడా అదే గుణాలబ్బినాయి. పాలతీర్థం బాగు చేయడానికి, రమణ తీర్థ నిర్మాణానికి, హాలు కట్టించడానికి మరికొన్ని ఆశ్రమకార్యాలకు, ఆర్థిక సహకారాన్ని అందించారు. మంచి పుత్రుడిగా తల్లి మంచి, చెడ్డలు చూడాలని తన శిష్యులను సన్మార్గంలో నడిపించాలని, భగవాన్ అనుమతితో అన్నారెడ్డిపాళెంకు తిరిగి వచ్చి శ్రీరామాశ్రమాన్ని స్థాపించి సేవలందించారు. సంవత్సరానికి రెండుసార్లు రమణాశ్రమానికి వచ్చి వెళ్తుండేవారు. వివేకానందుడు, రామకృష్ణ పరమహంస బోధనలను పాశ్చాత్యులకు అందించినట్లు, రామయోగి పల్లెప్రజలకు రమణ మహర్షి బోధనలను అందించారు. రామయోగి సుతిమెత్తటి స్వభావం గలవారు. కారుణ్యం మూర్తీభవించిన యోగిపుంగవుడు. సర్వప్రాణులను, అన్ని కులాల, మతాల వారినీ సమత్వభావంతో ప్రేమించేవారు. పొలంలో పనిచేసే దళితుడికి తలకు దెబ్బతగిలిరక్తం కారుతుంటే, తాను సొంతంగా మందు పూసి కట్టుకట్టి నయం అయ్యేవరకు తన ఆశ్రమంలో ఉంచుకొని సేవ చేశారు. అలాగే పండ్లు అమ్ముకొనే ఒక ముసలి ఆవిడ కాలికి దెబ్బతగిలితే కట్టుకట్టి సేదదీర్చి పంపాడు. దర్శనార్థం వచ్చిన ఒక వృద్ధ స్త్రీ వడదెబ్బకు పడిపోతే ఆశ్రమంలో ఉంచుకొని చికిత్స అందిస్తుంటే రెండురోజుల తర్వాత చనిపోయింది. ఆమె అంత్యక్రియలు రామయోగిగారే జరిపించారు. అట్లే ఒక దిక్కులేని కలరా రోగి ఆశ్రమంలో వదలబడితే మందులిప్పించి కోలుకొన్న తర్వాత పంపేశారు. ఆయన ఆశ్రమంలో పేదలకు అన్నదానం జరిగేది. ఆశ్రమానికి వచ్చే భక్తులందరినీ సమానంగా ఆదరించేవారు.

తపోబలసంపన్నుడైన రామయోగికి సిద్ధులున్నట్లు ప్రతీతి. వారి దర్శనంతో కష్టపరంపరతో దుఃఖితులైన వాళ్ళకు శాంతి లభించేది. పేరు గాంచిన సంఘసేవకురాలు, గాంధేయవాది అయిన నెల్లూరికి చెందిన పొణకా కనకమ్మ తనకు ఉన్న ఒక్క కూతురిని పోగొట్టుకొని మనశ్శాంతి కోసం అరుణాచలంలో, రమణ మహర్షుల దర్శనానికి

వెళ్ళింది. వారి దర్శనానికి కొంత తడవు ఉన్నందువల్ల, ఆలోగా రామయోగి కుటీరానికి వెళ్ళింది. ఆయన అప్పుడే ధ్యానం ముగించుకొని లేచారు. యోగిగారిని ఆవరించిన దివ్యతేజస్సుతో కూడిన చల్లని చూపులు ఆమెపై ప్రసరించగానే ఆమెకు శాంతి లభించింది. ప్రథమ దర్శనంతోనే ఆయనకు శిష్యురాలైంది. "శ్రీ గురుదేవుడు" అని వారిని గురించి ఒక గ్రంథాన్ని రచించి, ముద్రించింది. పరమహంస యోగానంద 1935 సం॥లో రామయోగిని దర్శించారు. వారితో చేతులు కలిపి తిరిగారు. ఆ క్షణాలను పరమహంస ఇలా వర్ణించారు. "రామయోగి జీవన్ముక్తుడు. ఇంకొక అర్ధగంట ఆయనతో గడిపి ఉంటే నేను భారత దేశాన్ని వదలి వచ్చి ఉండేవాడిని కాను" ఈ విషయాన్ని పరమహంస గారి శిష్యుడు స్వామి క్రియానంద 'ఆటోబయోగ్రఫీ ఆఫ్ ఎ వెస్టర్న్ యోగి' అనే స్వీయరచనలో ఉటంకించారు.

రామయోగి చివరి రోజులలో పూర్తి స్పృహతోనే ఉన్నారు. ఆయనను అవసానదశలో సేవించినవారు, ఆయన శిష్యాగ్రగణ్యులు, రమణ భక్తులు అయిన పూజ్యశ్రీ ప్రజ్ఞారణ్య స్వామి వారు. (వారి పూర్వాశ్రమంలో). మదరాసులో యోగిగారు ఆసుపత్రిలో ఉన్నప్పుడు డాక్టరు వచ్చి రోగి పరిస్థితి అంచనా వేసేందుకుగాను "ఇప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు" అని అడిగారట. నేను అంతటా ఉన్నానని సమాధానం ఇచ్చారట యోగిగారు. అంటే ఆత్మైక్య స్థితిలో ఉన్నారట. 29.7.1895 నాడు (ఫిబ్రవరి సంచికలో పొరపాటున తేదీ 27 అని ముద్రారాక్షసము దొర్లినది) జన్మించిన రామయోగి తే 12.2.1996 ది. సిద్ధి పొందారు. అన్నారెడ్డిపాళెంలో వారి సమాధి వెలిసింది. ప్రజ్ఞారణ్యస్వామివారి ఆధ్వర్యంలో యోగిరామ తపోవనం అనే అంతర్జాతీయ ఆత్మపరిశోధన యోగసాధన ఆశ్రమం నడుస్తుంది.

*(ఆధారాలు/సౌజన్యం: ఆంధ్రమహా యోగులు - ద్వితీయ భాగం డా॥ బి రామరాజు, శ్రీ రమణలీల (కృష్ణభిక్షు), రమణ పెరియ పురాణము, సెల్ఫ్ రియలైజేషన్ (బి.వి. నరసింహస్వామి), అంతర్జాలము.*

# శ్రీమతి సూరినాగమ్మ గారు

- శ్రీమతి కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి

భగవాన్ రమణమహర్షి వైపు ఒక్కసారి చూడగానే, నోటమాటరాక అమితమైన ఆశ్చర్యంలో ఆమె మునిగిపోయారు. కారణం జ్ఞానుల యొక్క లక్షణాలను పుణికి పుచ్చుకున్న ఒక మహాత్ముడు, సుమారు అప్పటికి 30 సంవత్సరాల క్రిందట తన స్వప్నంలో దర్శనమిచ్చిన వారే ఈ రమణమహర్షిగా గుర్తించడం. “నా దగ్గరకు రావడానికి నీకింత కాలం పట్టిందా? అని ప్రశ్నిస్తున్నట్లుగా ఉంది మహర్షి చూపు. దానితో ఆవెు మరింత సంభ్రమాశ్చర్యాలకు లోనై వెంటనే వారిని మానవరూపం ధరించిన దైవంగా గుర్తించారు. ఆయనను తన సద్గురువుగా ఎంచుకోవడమేగాక అరుణాచలంలోనే శాశ్వతంగా ఉండి పోవాలని ఆ క్షణమే నిర్ణయించుకున్నారు. ఆమెయే సూరినాగమ్మగారు.

గుంటూరు జిల్లాలో మంగళగిరి దగ్గరనున్న ‘కొలనుకొండ’ అగ్రహారంలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు గోర్బల చినవెంకటశాస్త్రిగారు, సోమదేవమ్మగారు ఆమె చిన్నతనంలోనే మరణించారు. బాల్యంలో వివాహం జరగగా భర్త కూడా కొంత కాలానికే పోవడంతో మానసిక క్షోభకు గురి అయ్యారు. అలాంటి సమయంలో మహాత్ములను గురించిన మాటలు, పాటలు ఆమెకు మానసికశాంతిని ప్రసాదించాయి. కనీసం పాఠశాల విద్యకు కూడ నోచుకోని నాగమ్మగారు ఆధ్యాత్మిక గ్రంథాల పఠనం మూలంగా తన మాతృభాష అయిన తెలుగును నేర్చుకుని దానిలో పట్టు సాధించారు. ముఖ్యంగా, భాగవత గ్రంథంలో ‘కపిలుడు’ తన తల్లికి ముక్తిని పొందే మార్గాన్ని బోధించే ఘట్టము ఎంతగానో ఆమెను ప్రభావితం చేసి ఆమె

జీవితాన్నే మలుపు త్రిప్పింది. ఎవరైనా మహాత్ముని కలుసుకొని ఆయన సేవలో తరించాలని తపనపడుతున్న సందర్భంలో ఆమెకు కలలో దక్షిణామూర్తిని పోలిన సిద్ధపురుషులొకరు దర్శనమిచ్చారు. కుటుంబ బాధ్యతల మూలంగా సద్గురువును ఆశ్రయించాలన్న ఆమె కోరిక అప్పటికి వాయిదాపడింది.

కొన్ని పరిస్థితుల కారణంగా కుటుంబం అంతా విజయవాడకు తరలిరావడంతో అక్కడ ఆమెకు సత్సాంగత్యం లభించడమేగాక, మరిన్ని ఆధ్యాత్మిక గ్రంథాలను చదివే అవకాశం కలిగింది. తరువాత కొన్ని సంవత్సరాలకు తన సోదరుడైన డి.ఎస్.శాస్త్రిగారి ప్రోత్సాహంతో అరుణాచలం వెళ్ళారు. అక్కడ భగవాన్‌ను తన సద్గురువుగా గుర్తించ గానే అనేక గీతాలు, కవితలు, పద్యాలు వాటంతట అవే అప్రయత్నంగా ఆమె మనసునుండి వెలువడసాగాయి. సత్పురుషులను సేవించి ముక్తిని పొందాలనే ఆమె కోరిక ఎట్టకేలకు ఆమెను భగవాన్ సన్నిధికి చేర్చింది. భగవాన్‌ను సేవిస్తూ, భగవాన్ ఉపదేశ గ్రంథాలన్నీ శ్రద్ధగా చదివి మననం చేసుకుంటూ ఎక్కువ సమయం సాధనలో గడిపేవారు. ఆ ప్రయత్నంలో అప్పుడప్పుడు కలిగే సందేహాలను ఒక చీటీపై వ్రాసి భగవాన్ వద్దకు పంపేవారు. ‘‘ఎందుకు ఈ సందేహాలను పట్టించు కుంటారు? వాటిని గమనించేకొద్దీ అవి బలపడతాయి. లోనికి మునగండి’’ అన్న భగవాన్ సమాధానంతో తృప్తిపడి ఒక మంచి విద్యార్థినిగా భగవాన్ సూచించిన ఆత్మవిచారణలో మునిగిపోయేవారు. ఈ సాధనలో తానెవరో తెలుసుకోవాలంటే తనలోపలికి చూచుకుంటే చాలు అన్న విషయాన్ని చాలా స్పష్టంగా గ్రహించారు.

అరుణాచలం చేరిన ఆమెకు ఎచ్చమ్మాళ్ అనే యోగినీమణి ఇంటి ప్రక్కనే ఇల్లు దొరకడం వరమైంది. భగవాన్‌ను సేవిస్తూ ఆత్మలో స్థిర

పడిపోయిన ఎచ్చమ్మాళ్ యొక్క పరిచయంతో ఆమెకు గొప్ప సత్సంగం లభించినట్లయింది. ఆ ప్రభావంతో ఒకరోజు సూరినాగమ్మగారు భగవాన్‌ను ''దయచేసి నేను ముక్తిని పొందడానికి తోడ్పడండి'' అని ప్రార్థించారు. అప్పుడు భగవాన్ ఆమెవైపు తిరిగి అంగీకరిస్తున్నట్లు తల ఊపారు. భగవాన్ ఆ విధంగా ప్రతిస్పందించడం చాలా అరుదు అని ఎచ్చమ్మాళ్ ఆమెతో అన్నారు. భగవాన్ సాధకులలో ప్రతి ఒక్కరికి వారివారి అంతర్గతస్వభావాన్ని అనుసరించి ఆధ్యాత్మికపరమైన సూచనలను ఇచ్చేవారని ఆమె గ్రహించారు. అందుకే ఆమె ఒక కవయిత్రియే గాక ప్రతిభగల రచయిత్రి అనే విషయాన్ని పరిగణనలోనికి తీసుకుని ఆమెను ఆధ్యాత్మికపథంలో నడిపించారు. తెలుగు వ్రాతప్రతుల విషయంలో ఆమెను సమర్థురాలిగా గుర్తించి, ఒక పెద్ద బౌండ్‌నోట్ పుస్తకాన్ని భగవాన్ స్వయంగా ఆమెకు ఇచ్చారు. ఇక ఆ రోజు నుంచి తెలుగు రచనలన్నింటిని వ్రాయుటకు, కాపీ చేయుటకు, భద్ర పరచుటకు ఆమె అధీకృత వ్యక్తి అయ్యారు.

దీనితో భగవాన్‌కు బాగా సన్నిహితంగా ఉండగలిగే అపురూపమైన అవకాశం ఆమెకు లభించింది. ఆ సమయంలో భగవాన్ జరిపే ప్రశ్నోత్తరాలను లేఖలరూపంలో వ్రాసి భగవాన్‌కు చదివి వినిపించగా ఆయన వాటిని మెచ్చుకోవడంతో ఆమె క్రమం తప్పకుండ లేఖలను వ్రాయడం మొదలుపెట్టారు. అవే తరువాతి కాలంలో 'రమణాశ్రమ లేఖలు' అనే పేరుతో గ్రంథరూపంలో ప్రచురింపబడ్డాయి. దాని మూలంగా రమణభక్తుల హృదయాల్లో ఆమె ప్రియమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇంతేగాక ఆమె వ్రాసిన 'నా రమణాశ్రమ జీవితము' అనే తన జ్ఞాపకాలు సమాజాన్ని చాలా ప్రభావితం చేశాయి. ఆ రచనను ఆమె సోదరుడు డి.ఎన్. శాస్త్రిగారు ఆంగ్లంలోనికి అనువదించారు.

ప్రతి తెలుగు ఉగాది ముందు రోజు సాయంత్రం ఒక 'కౌపీనాన్ని' భగవాన్‌కు సమర్పించడం తన అలవాటుగా పెట్టుకున్నారు నాగమ్మ గారు. భగవాన్ ఆఖరి రోజులలో చివరి ఉగాది ముందు రోజున ఎప్పటి లాగే కౌపీనాన్ని సమర్పిద్దామని తీసుకు వచ్చి దానిని ఆ స్థితిలో స్వీకరి స్తారా లేదా అని తటపటాయిస్తున్న సమయంలో భగవాన్ దానిని స్వీకరించడం ఆమె గురుభక్తికి నిదర్శనం. అనేక అంతరాయములను తట్టుకుంటూ ఆధ్యాత్మిక జీవితం గడిపిన సూరినాగమ్మగారు భక్తి శ్రద్ధలతో భగవాన్‌ను సేవించిన కారణంగా కష్టాలన్నీ తొలగి ప్రశాంతం గా జీవించగలిగారు. సద్గురు కటాక్షం వల్లనే అది సాధ్యమైనదని సూరినాగమ్మగారి జీవితం చెప్తున్నది.

ఆమె చివరి రోజులలో ఒంటరిగా, విజయవాడలో ఒక కుటీర మందు ప్రశాంతంగా జీవనాన్ని గడుపుతూ, ఎవరైనా జిజ్ఞాసువులు వస్తే వారికి సందేహనివృత్తి చేస్తూ, ఉత్తమ గ్రంథాలు చదివి వినిపిస్తూ, సరియైన ఆధ్యాత్మిక మార్గాన్ని చూపిస్తూ 1980 మార్చ్ 31న భౌతిక కాయాన్ని వీడి భగవాన్‌లో ఐక్యమొందారు.

*(ఆధారం: రమణ పెరియ పురాణం, నా రమణాశ్రమ జీవితం)*

## మనవి

రమణజ్యోతి పత్రికలో ప్రచురితమయ్యే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు కేవలం రచయితల సొంతవి మాత్రమే. పత్రిక యాజమాన్యం, సంపాదక వర్గాలకు వీటితో ఎలాంటి సంబంధం లేదు.

# గురువు అనుగ్రహమే దివ్యమైన ఔషధము

మూలం: శ్రీ వి. కృత్తివాసన్ అనువాదం: మల్లాది ఫణిమాల

అది ఒక పండుగరోజు. భగవాన్ తన భక్తులతో ఆహ్లాదభరిత సంభాషణలయందు నిమగ్నులై విరూపాక్ష గుహయందు ఉన్నారు. మనవాసి రామస్వామి అయ్యరు నిరుత్సాహముతో కూడిన ఆలోచనలు కలిగినవారై బయట కూర్చుని ఉన్నారు. భగవాన్ బయటకు వచ్చి ఏమిటి విషయము? ఎందుకు విచారంగా ఉన్నావు? అని అడిగిరి. భగవాన్! నాకు చాలా నిరుత్సాహముగా నున్నది. ఏమి తిన్నను అరుగుట లేదు. నిదుర పోలేకున్నాను. నా ఇల్లంతయు మందు సీసాలతో నిండి ఉన్నను నా అనారోగ్యమును నివారించుటకు ఏదియు పనికిరాకున్నది. నా భవిష్యత్తు గురించి భయముగా నున్నది. నేనేమి చేయవలెను? అని అడిగిరి. భగవాన్ రామస్వామిపై దృష్టి సారించి అతనిని పరికించిరి. ఆ చూపు మాత్రముననే రామస్వామి స్వాంతన పొందిన వారై, కొంత ఆవేదన తగ్గినట్లుగా అనుభూతి పొందిరి. ఆ రోజు సాయంత్రము పండుగ పిండివంటలతో చాలా ఆహారము వచ్చినది. అందరూ సంతోషముగా ప్రక్కనే ఉన్న చెరువు గట్టున విందు భోజనమునకు గుమిగూడిరి. అది నిజముగా ఒక విహారయాత్రకు అనుకూలమైనట్లు అప్పుడే కురిసిన వాననీటితో నిండిన చెరువు, ప్రక్కనే పచ్చని చెట్లతోను అందముగానున్నది. రామస్వామికి మాత్రము ఆ చక్కటి ప్రదేశము ఆనందోత్సాహానిని కలిగించలేదు. ఆయన మనసంతయు కల్లోలమైన ఆలోచనలతోను, శరీరమంతయు నొప్పుల తోను అసౌకర్యముగా నుండెను. అందుచే ఆయన ఇతరులతో కలువ కుండిరి. రామస్వామి అయ్యరు కనుపించక భగవాన్ అయ్యప్పను తీసుకు రమ్మని వాసుదేవశాస్త్రిని పంపిరి. వాసుదేవశాస్త్రి పిలువగా రామస్వామి "నేను మెత్తనైన గంజిని కూడా జీర్ణించుకోలేకున్నాను.

అటువంటిది ఈ మిఠాయిలు, పిండివంటలు మొదలైనవి ఎట్లు తిందును అనెను. ఎలాగైతేనేమి భగవాన్ పిలుపు మేరకు రామస్వామి అయ్యరు అందరు ఉన్న చోటికి వెళ్ళెను. భగవాన్ రామస్వామి అయ్యరును తన ప్రక్కనే కూర్చుండునట్లు చూసి ఆయనకు పదార్థము లన్నియు వడ్డన జరుగునట్లు చూసి, ఇంక తినుమని చెప్పిరి.

మొత్తానికి అన్ని సందేహములు తొలగి, చాలా ఏళ్ళ తరువాత రామస్వామి అయ్యరు కడుపునిండుగా అన్నియు భుజించిరి. ఆయనకు ఏమియు అసౌకర్యములేక ఆ రాత్రి హాయిగా నిద్రపోయిరి.

మరునాడు ఉదయము రామస్వామి అయ్యరుకు స్వస్థత చేకూరినట్లు అనిపించెను. అనారోగ్యం ఛాయలేమి కనుపించలేదు. ఇదంతయు భగవాన్ అనుగ్రహమే అని రామస్వామి అయ్యరునకు తెలుసు. రామస్వామి అయ్యరు కుటుంబమంతయు అమితానంద భరితులై భగవానునకు కృతజ్ఞులై ఉండిరి.

రామస్వామి అయ్యరు అనుభవమే గురువు యొక్క అనుగ్రహము దివ్యౌషధమనుటకు మంచి ఉదాహరణ.

## బహిర్గతమైన రహస్యం

**ఒక రోజు భగవాన్ రాత్రి భోజనము తరువాత "ఉన్నది నలుబది" యొక్క అర్థమును వివరించెదను అని ఒక భక్తునికి చెప్పిరి. అది భక్తులందరకూ తెలిసి, అందరూ రాత్రి భోజనానంతరము పాత హాలునకు చేరిరి. భగవాన్ చెప్పుట ప్రారంభించి 21వ శ్లోకమునకు రాగానే "భగవంతుని తెలుసుకొనుట అనగా, భగవంతునిగా ఉండటమే" అదియే ఆ శ్లోకమునకు అర్థము అని చెప్పిరి. అప్పుడు దండపాణిస్వామి "ఇది భగవానుల స్వానుభవమా" అని అడుగగా భగవాన్ "అట్లు కానిచో నేను అంత ఖచ్చితముగా ఎట్లు చెప్పగలను" అని సమాధానమిచ్చిరి.**

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: సుందరేశ అయ్యర్
(మార్చి సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

## మనిషి-మృగము సమత్వం

శ్రీ రంగస్వామి అయ్యంగార్ మద్రాసులో వ్యాపారస్థులు. వారు శ్రీ భగవాన్‌ను, 1906కు ముందు నుండి (పచ్చయ్యమ్మ కోవిలలో మహర్షి వుండిన రోజుల కంటే ముందు నుండి) దర్శిస్తుండేవారు. తిరువణ్ణామలలో భయంకరమైన ప్లేగు వ్యాధి సోకినప్పుడు, శ్రీ భగవాన్ పచ్చయ్యమ్మ గుడిలో నివసించేవారు. ఒక రోజు ఒంటి గంట రైలులో మిట్ట మధ్యాహ్నం, ఎండ మండిపోతున్న సమయంలో, శ్రీ అయ్యంగార్ శ్రీ భగవాన్ దర్శనార్థము వచ్చారు. శ్రీ భగవాన్ తమ సహజమయిన తీపి చిరునవ్వుతో ఆయనకు స్వాగతము పలికారు. దగ్గర వున్న భక్తులు పక్కనే వున్న చెరువులో స్నానము చేసి రమ్మని శ్రీ అయ్యంగార్‌కు చెప్పారు. గుడి ముందు వున్న ఆ చెరువులో స్నానానికని శ్రీ అయ్యంగార్ వెళ్ళారు.

ఆ ప్రదేశంలో జన సంచారముండదు. పూర్తిగా నిర్మానుష్యం. తూర్పు వైపు వున్న ఘట్టంలో శ్రీ అయ్యంగార్ స్నానం చేస్తున్నారు. ఉన్నట్లుండి గుడిలో కూర్చొని వున్న శ్రీ భగవాన్ చటుక్కున లేచి వెళ్ళారు. ఏదో కాలకృత్యం కోసం శ్రీ భగవాన్ లేచి వెళ్ళారని అక్కడ వున్న వాళ్ళనుకున్నారు. శ్రీ భగవాన్ చెరువు దగ్గరకు వెళ్ళగానే వారికి ఒక చిరుతపులి, దాహం తీర్చుకోవడానికి చెరువు ఉత్తర భాగానికి వస్తూ కనిపించింది.

శ్రీ భగవాన్, నెమ్మదిగా చిరుతపులితో "ఇప్పుడు వెళ్ళిపో! తరువాత రా. ఆయన భయపడతారు" అన్నారు. శ్రీ భగవాన్ మాటలు వినగానే చిరుతపులి అక్కడ నుండి వెళ్ళిపోయింది.

అది పోగానే, శ్రీ భగవాన్ అయ్యంగార్ దగ్గరకు వెళ్ళి, ఈ సమయంలో మనం యీ ప్రాంతానికి రాకూడదు. వన్యమృగాలు నీరు త్రాగడానికి యిక్కడకు వస్తుంటాయి అని చెప్పారు కాని, ఒక వన్యమృగం అప్పుడే వచ్చి వెళ్ళిందని మాత్రం చెప్పలేదు శ్రీ అయ్యంగార్ భయపడతారని. మనిషి పట్ల మృగం పట్ల శ్రీ భగవాన్ తమ సమదృష్టిని అలా చూపించారు. కొద్దిరోజుల తరువాత, శ్రీ భగవానే మాకీ విషయం తెలియపరిచారు.

**'నేనెవరిని' నాయనా?**

శ్రీ భగవాన్ విరూపాక్ష గుహలో వున్న రోజులవి. ఒక సాయంకాలం ఏడుగంటల ప్రాంతంలో, అందరూ గిరి ప్రదక్షిణ కోసం కొండ దిగుతున్నారు. మిగిలిన భక్తులు ముందుగా దిగి వెళ్ళారు. శ్రీ భగవాన్‌తో నాయన శ్రీ కావ్యకంఠ గణపతి ముని మాత్రమే వున్నారు. గుహనుండి వాళ్ళిద్దరు నెమ్మదిగా మెట్లు దిగుతున్నారు.

కొన్ని మెట్లు దిగిన తరువాత శ్రీ భగవాన్, వున్నట్టుండి ఆగిపోయారు. ఆయనతోబాటు నాయన కూడా నిలిచి పోయారు. ఆకాశం అంతా నక్షత్రాలు నిండి వున్నాయి. పున్నమి చంద్రుడు వెన్నెల నింపుతున్నాడు. శ్రీ భగవాన్ యిలా అన్నారు, "నాయనా! ఈ చంద్రుడూ, తారలూ నాలో నిక్షిప్తమయి వుండి, సూర్యుడూ, యితర గ్రహాలన్నీ నా నడుము చుట్టూ తిరుగుతూ వున్నట్లయితే నేనెవరిని? నేనెవరిని?"

పై ప్రకటనను విన్న భాగ్యశాలి, శ్రీ భగవాన్ యొక్క ప్రియ శిష్యులు, అయిన శ్రీ నాయనకు శ్రీ రుద్రములోను, పురుష సూక్తములోను, అధర్వణ వేదములోని స్కంబ సూక్తములోను వర్ణింపబడిన వేదపురుషుడు సాక్షాత్తు శ్రీ భగవాన్‌లో గోచరమయ్యారు. అన్నీ వారే. వారిని మించినది, వారు కానిది యింకేమీ లేదు. కావ్యకంఠులు యీ విషయాన్ని అందరకూ తెలియపరిచారు. (సశేషం)

# ఆత్మసాక్షాత్కార సూత్రాలు

ఆంగ్లమూలసంకలనం: నండూరి శ్రీ రామ మోహన్
తెలుగు అనువాదం: పింగళి సూర్యసుందరం

(డిశంబరు 2016 సంచిక తరువాయి)

**4.17 "పని చేసేది ఎవరు? అని విచారించు, "నేనెవడను?" ఇది గుర్తుంచుకో, పని నిన్ను బంధించదు, అది దానంతట అది జరిగి పోతుంది. (స.268)**

మ: విషయ పరిత్యాగమునకై గల కోరికయే ఆటంకము. ఆత్మ అంటే కేవలము త్యాగమే. ఆత్మ సమస్తమును పరిత్యజించి యున్నట్టిది.

భ: భగవాన్ యొక్క దృక్పథమును బట్టి అది నిజమే. కాని మాకు - నా విధి నిర్వహణ కొరకే నాకున్న సమయంలో ఎక్కువ భాగం నా యావచ్ఛక్తీ వ్యయము చేయవలసి వస్తోంది. ఆత్మ చింతనము చేయాలన్నా కూడా నేను తరచు బాగా అలసిపోయి ఉంటున్నాను.

మ: 'నేను పనిచేస్తున్నాను' అనే భావనయే ఆటంకము. 'పని చేస్తున్నది ఎవరు?' అని విచారించు. 'నేనెవడను?' అనే విషయాన్ని గుర్తులో ఉంచుకో. చేస్తున్నపని నిన్ను బంధించదు. అది అప్రయత్నంగా సాగిపోతుంది. పని చేసేందుకు గాని, పనిని మానివేసేందుకు గాని ప్రయత్నించవద్దు. నీ ప్రయత్నమే బంధము. జరుగవలసినది జరిగే తీరుతుంది. నీవు పని చేయరాదని వ్రాసిపెట్టి ఉంటే, దాని కోసం ఎంతగా వెంపరలాడినా, చేయటానికి నీకు ఆ పని లభించదు. నీవు పనిచేయవలసి ఉన్నదని వ్రాసిపెట్టి ఉంటే, బలవంతముగానైనా నీవు ఆ పని చేసే తీరుతావు. కాబట్టి అంతటినీ ఆ మహాశక్తికి వదలిపెట్టు. నీవు ఎంచుకొన్న విధంగా, దేనినీ పట్టుకోనూలేవు, పరిత్యజించనూ లేవు!

భ: ఆత్మ సాక్షాత్కారానికి కర్మచేయటం అవరోధము అవుతుందా? (స.17)

మ: లేదు. జ్ఞానసిద్ధునకు ఆత్మ మాత్రమే సత్యము, కర్మలు దృశ్య విషయములు. అవి ఆత్మను బాధించవు. అతడు ఏదైనా కర్మను చేసి నప్పటికీ, తాను కర్తను అనే భావన అతనికి ఉండదు. అతడు చేసే పనులన్నీ అసంకల్పితములు. వానికి అతడు సాక్షి మాత్రుడై, వాని పట్ల అనాసక్తితో ఉంటాడు. అతని చర్యలకు ఏ ఉద్దేశ్యమూ ఉండదు. జ్ఞాన మార్గగామి అయిన సాధకుడు కూడా పనులు చేస్తున్నప్పుడు ఇదే దృష్టిని కలిగి ఉండేందుకు అభ్యాసము చేయవచ్చు. ముక్తినికోరు వానికి ప్రారంభదశలలో ఇది కష్టంగానే ఉండవచ్చు. కాని కొంత అభ్యాసం అయిన తరువాత, అచిరకాలంలోనే అది ఫలవంతమౌ తుంది. అప్పుడు కర్మాచరణము ధ్యానాభ్యాసమునకు ఆటంకము కాదని తెలుస్తుంది.

భ: నాకు వృత్తి పరమయిన పనులు ఉన్నాయి. అయినా నేను నిరంతర ధ్యానంలో ఉండాలని కోరుకుంటున్నాను. ఈ రెంటికీ పరస్పర వైరుధ్యం ఉన్నదా? (స.30)

మ: విరోధము లేదు. నీవు రెంటినీ అభ్యాసం చేస్తూ, నీ శక్తి సామర్థ్యాలను పెంపొందింపజేసుకొంటున్న కొద్దీ, ఆ రెంటినీ చక్కగా చేయగల్గుతావు. నీ వృత్తి వ్యాపారాదులను నీవు స్వప్నతుల్యములుగా చూడటం మొదలు పెడతావు.

భగవద్గీతలో ఇలా చెప్పబడింది:

"యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ ।

యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః ॥ (గీత 2-69)

"సర్వజీవులకు ఏది రాత్రిగా ఉంటుందో, అది యోగికి మెలకువతో ఉన్న సమయముగా ఉండును. జీవులకు ఏది మెలకువగా ఉంటుందో అది ముని అయిన వానికి రాత్రిగా ఉండును."

భ: కర్మకూ ధ్యానమునకు సమన్వయము ఎలా? (స.68)

మ: కర్మ చేసేవాడు ఎవడు? కర్మ ఎవడు చేస్తున్నాడో వాడే ఈ

ప్రశ్నను అడుగవలసి ఉంటుంది. నీవు ఎప్పుడూ ఆత్మవే. నీవు మనస్సువు కావు. ఈ ప్రశ్నలన్నింటినీ లేవనెత్తేది మనస్సే. ఆత్మ సాన్నిధ్య ములోనే ఎప్పుడూ కర్మ కొనసాగుతుంది. సాక్షాత్కారమునకు కర్మ అవరోధము కానేకాదు. కర్త యొక్క మిథ్యా తాదాత్మ్యమే మనఃక్లేశము నకు కారణమవుతున్నది. ఈ మిథ్యా తాదాత్మ్యాన్ని వదలిపెట్టు.

**4.18 వ్యక్తిత్వం పోయేదాకా విచారణను కొనసాగించవలసి ఉంటుంది (స. 454)**

భ: మనిషి బహిర్వ్యాపారములలో నిమగ్నుడయి ఉన్నప్పుడు కూడా ఆత్మ విచారణను అభ్యసింపవలయునని శ్రీ భగవాన్ సూచించి యున్నారు. ఆత్మ విచారణ గమ్యం ఆత్మ సాక్షాత్కారము. అప్పుడు శ్వాస ఆగిపోవాలి. శ్వాస నిలిచిపోతే, కర్మ ఎలా సాగుతుంది. మరో మాటలో చెప్పాలంటే, పని చేసేటప్పుడు శ్వాస ఎలా నిలుస్తుంది?

మ: ఈ మాటలలో సాధ్యసాధనముల విషయములో అస్పష్టత కనిపిస్తోంది. విచారణ చేసేవాడు ఎవడు? అతడు సాధకుడే గాని, సిద్ధుడు కాడు. విచారణ చేయటం అనే మాటలో విచారణ వేరు, విచారించే వాడు వేరు అనే భావం ఇమిడి ఉన్నది. ఈ ద్వైతభావన ఉన్నంతకాలమూ విచారణ కొనసాగించవలసిందే; అంటే జీవత్వము నశించి (విచారణ, ఆ విచారణ చేసేవాడు అనే ద్వైతము నశించి) ఆత్మ ఒక్కటే శాశ్వతమయిన 'సత్' తత్త్వము అనే అనుభవము కలిగే వరకూ విచారణ చేయవలసిందే. 'సత్య'మేమిటంటే - ఆత్మ నిశ్చలము, అవిచ్ఛిన్నము అయిన ఎరుక. ఆత్మ స్వరూపము ఎరుకయే అని కను గొనుటయే విచారణోద్దేశము. భేదభావన గోచరించుచున్నంత వరకు సాధకుడు విచారణాభ్యాసము చేయవలసి ఉంటుంది. ఒక్కసారి సాక్షాత్కారము కలిగిందా, ఇక విచారణ చేయవలసిన అగత్యము లేదు. ఈ ప్రశ్న కూడా అప్పుడు తలెత్తదు. ఎరుక, ఎరుక కలిగియున్నది ఎవరు అని, తనను తాను ఎప్పుడైనా ప్రశ్నించుకొనే సందర్భము

ఏర్పడుతుందా? ఎరుక శుద్ధముగా సరళముగా ఉంటుంది. విచారణ చేసే వానికి తన వ్యక్తిత్వము యొక్క ఎరుక ఉంటుంది. జీవపరమ యిన అతని ఎరుకకు విచారణ అడ్డుగా నిలువదు. బహిర్వ్యాపార ములు కూడా అట్టి ఎరుకను అడ్డగింపవు. బాహ్యమని తోచే కర్మ వ్యక్తి యొక్క ఎరుకను అడ్డగించనప్పుడు ఇక ఆత్మ భిన్నముకాదని తెలిసికొన్న కర్మ అఖండమయిన ఆత్మ యొక్క ఎరుకను అడ్డగిస్తుందా? ఆత్మ అనునది అద్వితీయము; అది కర్మ కంటె వేరు అయిన వ్యష్టి తత్త్వము కాదు కదా!

**4.19 ఆ మహాశక్తిని నీవు గుర్తించినా గుర్తించకపోయినా, విధి నిర్ణీత మయి ఉన్న వ్యవస్థ మాత్రము మారదు, నీ దృక్పథములో మాత్రమే మార్పు వస్తుంది (స.503)**

ఆ మహాశక్తికి నిన్ను నీవు అర్పించుకొన్నట్లయితే, అంతా చక్కగానే ఉంటుంది. ఆ శక్తే నీ వ్యవహారములన్నింటినీ చక్కదిద్దుతుంది. నీవు కర్తవు అని భావించినంతకాలమూ నీ కర్మ ఫలములను నీవే అనుభ వించవలసి ఉంటుంది. అలా కాకుండా, నీవు శరణాగతి చెంది, నీ వ్యష్ట్యాత్మ ఆ మహాశక్తి చేతిలోని ఉపకరణము మాత్రమే అని గుర్తిస్తే, ఆ శక్తియే నీ వ్యవహారములన్నింటినీ, కర్మఫలములతో సహా, తనపై వేసుకొంటుంది. అవి నిన్ను ఇక యేమాత్రము బాధించవు. పని మాత్రము నిరాటంకముగా సాగిపోతుంది. ఆ శక్తిని నీవు గుర్తించినా, గుర్తించకపోయినా, విధి నిర్ణీతమై ఉన్న వ్యవస్థమాత్రము మారదు. నీ దృక్పథములో మాత్రమే మార్పు వస్తుంది. రైలు బండిలో ప్రయాణం చేస్తున్నప్పుడు నీ మూటను నీ నెత్తిపై ఎందుకు మోయటం? మూట రైలుబండిలో క్రింద ఉన్నా, నీ నెత్తిపై పెట్టుకొన్నా రైలు బండి మోసే బరువును నీవేమీ తగ్గించటం లేదు. కాకపోతే అనవసరంగా నిన్ను నీవు కష్టపెట్టుకుంటున్నావు; మనుషులకు ప్రపంచంలో ఉండే కర్తృత్వ భావన ఇలాంటిదే.

# Gandhiji and Bhagavan

Shankarlal Banker

(*Shankarlal Banker was an active participant in the trade union movement in the pre-independence era. He was also the publisher of the monthly Young India and was imprisoned with Gandhiji for printing the latter's controversial articles in 1922. Shankaralal's dialogues with Gandhiji and his meetings with Bhagavan and his impressions have been extracted from a book by M.V.Kamath and presented here. His notes and recollections present an insight into the mutual respect and understanding that the Mahatma and the Maharshi had for each other.)*

Shankarlal was involved in the propagation of khadi at the instance of Gandhiji, and at one stage he began to have serious doubts about what his role should be in the scheme of things. It was at that stage that he received guidance from an altogether unexpected source: Bhagavan Ramana Maharshi! And this came about in the unlikeliest way. In 1934, Shankarlal was living at Mirjapur in Ahmedabad where he met a German aristocrat who was a high-ranking officer of the German Air Force. The officer was staying as a guest of Ambalal Sarabhai but took the occasion to call on Shankarlal. In the course of their conversation the officer happened to mention his interest in matters spiritual and philosophical and wondered whether Shankarlal had heard of Bhagavan Ramana Maharshi. To his embarrassment Shankarlal had not heard of the saint of Tiruvannamalai. Somewhat surprised, the German officer said: "Do go and see him and get his *darshan.* He is a rare personality!" The fact that a member of the German nobility, a Baron and an officer of the German Air Force should have made that suggestion intrigued him.

In the summer of 1935, Shankarlal started his round of visits of khadi centres in Tamil Nadu. While at Tirupur, he met with an old friend, Mohanlal Purohit. Purohit not only took a great deal of interest in khadi, but was a great admirer of Gandhiji and utilized Shankarlal's regular visits to discuss Gandhian philosophy with him.

As luck would have it, on the day he called on Purohit he chanced to meet the editor of the Madras-based Sunday Times, Mr. M. S. Kamath. Kamath was a great devotee of Ramana Maharshi and Shankarlal promptly started to ply him with questions. Kamath thereupon suggested that Shankarlal should accompany him to Tiruvannamalai, and Purohit equally promptly lent his car for the journey. The party reached there around 7 p.m. At dinnertime Shankarlal saw the Maharshi for the first time and noticed that the latter had a "lustre in his eyes".

